# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 11 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 350





తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## వ్యవసాయాన్ని ఆదుకునేలా


# రైతుభరోసా

- ➢వ్యవసాయ రంగాన్ని కాపాడుకునే ప్రయత్నం
- ➢అర్హులైన వారికే రైతుభరోసా పెట్టుబడి
- ➢సన్న,చిన్నకారు రైతులకే చేయూత
- ➢హామీ అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ
- ➢వెల్లడించిన మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల




ఖమ్మం: వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందజేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయడం కోసం తమ ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. రైతుభరోసా పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందం పర్యటించింది. ఈ జిల్లాల పర్యటన


- మిగతా 2వ పేజీలో


## మరోమారు

## విజృంభిస్తున్న డెంగ్యూ




## నేడు డిఎస్‌సి హాల్ టిక్కెట్ల విడుదల

రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డిఎస్‌సి -2024 పరీక్షలు ఈనెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు.

## విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు

## భరణానికి అర్హులే

- సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 వీరికి వర్తిస్తుంది
- ఇది లౌకిక నిబంధన.. దీనికి మతంతో సంబంధం లేదు
- 1986 నాటి ముస్లిం మహిళల చట్టం ఇందుకు అడ్డురాదు
- భరణాన్ని దానంగా చూడకూడదు.. అది స్త్రీల హక్కు
- సుప్రీంకోర్టు కీలక తీర్పు




సీఆర్‌పీసీలోని సెక్షన్ 125ను విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింపజేయకపోతే అది రాజ్యాంగంలోని అధికరణం 15(1) ఉల్లంఘన కిందికే వస్తుంది.

## 2లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

### కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈటెల ప్రశ్న



హైదరాబాద్: రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే వాటి ఊసే ఎత్తడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ ఏమ్యిందని, మెగా డిఎస్సీ ఎక్కడ పోయిందని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ గద్దనెక్కిందని అన్నారు. మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ ఆధ్వర్యంలో ఉప్పల్ అసెంబ్లీ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్కారుపై అవిశ్వాసం ప్రకటించిన నిరుద్యోగ యువత యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. పీర్జాదిగూడలో 1985లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చడం సరికాదన్నారు. ఉప్పల్‌లో 35 ఏళ్ల క్రితం పేదలు నిర్మించుకున్న ఇళ్లను వక్ఫ్ భూములు అంటూ ప్రభుత్వ స్థలాలుగా చెప్పడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మార్క్..

## మార్పు వచ్చింది

- బల్లిపడిన టిఫిన్లు..
- చిట్టెలుక పడ్డ చట్నీలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా



**హైదరాబాద్:**మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అని అన్నారని.. మొత్తానికి.. కాంగ్రెసోళ్లు వచ్చారు.. పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు ఉండేవన్నారు. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఉందన్నారు. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు పిల్లలకు వడ్డిస్తున్నారన్నారని ఫైర్ అయ్యారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతంగా మారిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. నిన్న కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడి.. 20 మంది విద్యార్థులకు వాంతులు అయ్యాయన్నారు. సుల్తాన్ పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రశ్నించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడుందని నిలదీశారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయసులో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే.. విద్యార్థులకు ఈ అవస్థ... ఈ అస్వస్థత.. అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలన్నారు. లేకపోతే.. భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమన్నారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకుంటుందని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ పాఠాలు



హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ పాఠాలు బోధించనున్నట్లు మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచేందుకు 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' పేరుతో జులై 15 నుంచి వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారమిక్కడ అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భద్రత, దత్తత, చైల్డ్‌కేర్ అంశాలపై శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతివెస్లీతో కలిసి జిల్లా సంక్షేమాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యునెస్కో సహకారంతో రూపొందించిన న్యూట్రిషియన్ ఛాంపియన్ పుస్తకం, న్యూట్రిషియన్ కిట్లను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం సరకుల కట్టడికి క్షేత్రస్థాయి అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. "రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలి. భవనాలకు పెయింటింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి. చిన్నారులకు దేశంలోనే తొలిసారిగా త్వరలో యూనిఫాంలు అందిస్తాం. తెలంగాణను పోషకాహారలోప రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి పేర్కొన్నారు



## కిడ్నీ రాకెట్‌లో దర్యాప్తు ముమ్మరం ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**అమరావతి:** విజయవాడలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ వ్యవహారంలో పోలీసులు 5గురిపై కేసు నమోదు చేశారు. బాషా, వెంకట్, సుబ్రహ్మణ్యంతో పాటు డాక్టర్ శరత్‌బాబు, కిడ్నీ స్వీకర్త వెంకటేశంపై కేసు నమోదు చేశారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కిడ్నీ కోల్పోయిన మధుబాబుకు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ దానం చేస్తే రూ. 30 లక్షలు ఇస్తామని కొందరు ఆశచూపి గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబును మోసం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మధుబాబు అనే యువకుడిని విజయవాడకు చెందిన బాషా అనే వ్యక్తి సోషల్‌మీడియాలో పరిచయమయ్యాడు. మధుబాబు అవసరాన్ని ఆసరాగా చేసుకున్న బాషా.. కిడ్నీ దానం చేస్తే రూ.30 లక్షలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. 30 లక్షల డబ్బు వస్తే తన సమస్యలు అన్నీ తీరుతాయని ఆశపడిన మధుబాబు కిడ్నీ విక్రయానికి ఒప్పుకున్నాడు. దీంతో ఈ నెల మొదటి వారంలో విజయవాడలోని విజయ హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి కిడ్నీ తీసుకున్నారు. ఆపరేషన్ తర్వాత మధు బాబుకు 30 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ. 1.10 లక్షలు మాత్రమే బాషా ఇచ్చాడు. మిగిలిన డబ్బులు అడిగేసరికి బాషా తన నిజస్వరూపం బయటపెట్టాడు. స్నేహితుడిలా కిడ్నీ దానం చేసినట్లు సంతకం చేశావని మధుబాబుకు తెలిపాడు. కాబట్టి నీకు మిగిలిన డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ బెదిరించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. డాక్టర్ శరత్‌బాబు, మధ్యవర్తి బాషాపై గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేయగా పోలీసులు విచారణ జరిపి ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

## వీధికుక్కల నియంతకరణకు చర్యలు
### జిహెచ్ఎంసికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో వీధి కుక్కల నియంత్రణపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కుక్కల నియంత్రణకు వారంలోగా నిపుణుల కమిటీ వేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది. ఉదాసీనంగా వ్యవహరించేవారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. వీధి కుక్కల దాడిలో బాలుడి మృతిపై దాఖలైన పిల్‌పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ చేసి.. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. వీధికుక్కల నియంత్రణపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నది. కుక్కల నియంత్రణకు వారంలోగా నిపుణుల కమిటీ వేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఉదాశీనంగా వ్యవహరించే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించింది. పిల్లలతో పాటు జనాలపై కుక్కల దాడుల నేపథ్యంలో ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో గతంలోనూ హైకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా మరణాలకు కారణమవుతున్న వీధికుక్కల నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. వీధికుక్కల నియంత్రణకు సరైన చర్యలు తీసుకోవడం లేదని.. వ్యాక్సినేషన్ చేయడం లేదని.. సరైన ఆహారం లేకపోవడంతో జనాలపై దాడులు చేస్తున్నాయని ఓ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. గతేడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ బాగ్ అంబర్‌పేటలో పాఠశాల విద్యార్థిపై దాడి చేయగా.. మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతి సంఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణలోకి తీసుకుంది. గత నెలలోనూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో బిహార్ వలస దంపతుల ఆరేళ్ల కొడుకుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో కన్నుమూశాడు. ఆయా ఘటనలపై బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి బాధ్యత తీరిందని భావించొద్దని.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అనుపమ్ త్రిపాఠి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.

# మానవతతో భూ పరిహారం

హైదరాబాద్: జాతీయ రహదారులకోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించే విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో రోడ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలపై సచివాలయంలో సీఎం బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూసేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించగా.. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండటం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని జిల్లా కలెక్టర్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా పరిహారం ఇస్తామనే భరోసాను రైతులకు ఇచ్చి భూసేకరణకు ఒప్పించాలని సూచించారు.

ఒప్పంద ప్రక్రియ ప్రారంభించాలి

'ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి వీలుగా సాధ్యమైనంత త్వరగా ఒప్పందం చేసుకోవాలి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ఎన్‌హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవటానికి అవసరమైన ప్రక్రియ చేపట్టాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలను వేర్వేరుగా చూడొద్దని, రెండింటికీ కలిపి ఒకే నంబరు



కేటాయించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఇటీవల కోరగా.. సూత్రప్రాయంగా ఆమోదించారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలి' అని సీఎం ఆదేశించారు. ఉత్తర భాగానికి భూసేకరణలో ఉన్న ఆటంకాల గురించి ఆయన ప్రశ్నించారు. 'ఎలైన్‌మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించటంతో స్టే ఇచ్చింది' అని యాదాద్రి-భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం కౌంటర్ దాఖలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్ పరిధిలో ఖమ్మం జిల్లాలో భూసేకరణ పరిస్థితిపై రేవంత్ ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల నుంచి రహదారి నిర్మించాల్సి ఉందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ 'నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీస్ రోడ్లు నిర్మించాలి. రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అండర్‌పాస్‌లు నిర్మించాలి' అని కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్‌హెచ్ఏఐ(ప్రాజెక్టు) సభ్యుడు అనిల్ చౌధరి తెలిపారు. జాతీయ రహదారుల వెంట పొలాలకు వ్యవసాయ వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా గ్రావెల్ రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదన సమావేశంలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని అనిల్ చౌధరి చెప్పారు. గ్రావెల్ రహదారి నిర్మాణంతో రైతులకు ఉపయోగపడటంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకూ ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు భరణానికి అర్హులే

దిల్లీ: విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ నేర శిక్షాస్మృతి(సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 125 ప్రకారం భర్త నుంచి భరణం కోరొచ్చని సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఇందుకు 1986 నాటి ముస్లిం మహిళల (విడాకులపై హక్కుల రక్షణ) చట్టం అడ్డురాదని స్పష్టంచేసింది. వివాహమైన మహిళలందరికీ సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 వర్తిస్తుందని, ఇది లౌకిక నిబంధన అని తేల్చిచెప్పింది. ముస్లిం మహిళలు ఇందుకు మినహాయింపు కాదని పేర్కొంది. అంతేకాదు.. భరణాన్ని దానంగా చూడకూడదని.. అది మహిళల హక్కు అని తెలిపింది. తన భార్యకు భరణం చెల్లించాలంటూ కుటుంబ కోర్టు జారీచేసిన ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ.. మహమ్మద్ అబ్దుల్ సమద్ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం బుధవారం 99 పేజీల తీర్పును వెలువరించింది. "ముస్లిం చట్టం కింద వివాహం చేసుకున్న లేదా విడాకులు తీసుకున్న మహిళకు సీఆర్‌పీసీలోని సెక్షన్ 125, ముస్లిం మహిళల చట్టం-1986 వర్తిస్తాయి. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ ఈ రెండు చట్టాల ద్వారా, లేదా ఏదో ఒక చట్టం ద్వారానైనా ఉపశమనం పొందొచ్చు. ఎందుకంటే 1986 చట్టం.. సెక్షన్ 125ని అడ్డుకొనేది కాదు" అని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. భరణాన్ని దానంగా చూడకూడదని, అది లింగ సమానత్వానికి దోహదం చేసే అంశమని పేర్కొంది. ఈ కేసుపై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ వేర్వేరుగా తీర్పులు రాశారు. అయితే ఒకే అభిప్రాయాన్ని వెల్లడించారు.

## నేడు డిఎస్‌సి హాల్ టిక్కెట్ల విడుదల

**హైదరాబాద్:** రాష్ట్రంలో డిఎస్‌సి పరీక్షలు యథాతథంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.ఈ మేరకు గురువారం సాయంత్రం డిఎస్‌సి హాల్ టికెట్లు

వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో డిఎస్‌సి పరీక్షలు జరుగనున్నాయి. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డిఎస్‌సి -2024 పరీక్షలు ఈనెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. తొలిసారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో డిఎస్‌సి పరీక్ష జరగనున్నది. రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు డిఎస్‌సి పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇటీవల స్జబెక్టుల వారీగా పరీక్షల తేదీలను ప్రకటించారు. డిఎస్‌సి 2024 ఆన్‌లైన్ దరఖాస్తు పక్రియ మార్చి 4న ప్రారంభంకాగా?గత నెల 20వ తేదీతో గడువు ముగిసింది. ఈ ఉద్యోగాలకు మొత్తం 2,79,966 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

# తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్ తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ జరిగింది. 15 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలిలా ఉన్నాయి. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీగా మహేష్ భగవత్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీగా స్వాతి లక్రా,టిజిఎస్‌పి బెటాలియన్ అడిషనల్ డీజీగా సంజయ్ కుమార్ జైన్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీగా స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ కమిషనర్‌గా సుధీర్ బాబు, ఏసీబీ డైరెక్టర్‌గా తరుణ్ జోషి, మల్టీ జోన్ 1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రైల్వే, రోడ్ సేఫ్టీ ఐజిగా రమేష్ నాయుడు, మల్టీజోన్ 1ఐజిగా సత్యనారాయణ,హైదరాబాద్ సీఆర్ హెడ్ కోటర్ డీసీపీగా రక్షితమూర్తి,మెదక్ ఎస్పీగా డి. ఉదయ్ కుమార్ రెడ్డి, వనపర్తి ఎస్పీగా గిరిధర్, ఈస్ట్ జోన్ డీసీపీగా బాలస్వామి, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా చంద్రమోహన్ నియమితులయ్యారు.




# మరోమారు విజృంభిస్తున్న డెంగ్యూ

**విజయవాడ/హైదరాబాద్**

: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ కేసులు పెరుగు తున్నాయి. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు అన్న తేడా లేకుండా కేసులు పెరుగుతున్నాయి. డెంగ్యూ కేసుల న మోదును తెలయి పర్చాలని ఆరోగ్య శాఖ కూడా ఆదేశించినట్లు సమచారం. వర్షా కాలం కావడంతో పాటు ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిల్వ ఉంటున్నాయి. అవే ఇప్పుడు.. దోమలకు ఆవాసాలుగా మారనున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ దోమలు గుడ్లు పెట్టేందుకు ఇదే సరైన సమయం. నిలిచిన నీరు, అధిక తేమ ఏడిస్ దోమ వృద్ధికి కారణమవుతాయి. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిలబడకుండా జాగ్రత్తపడాల్సిందే. దీనికితోడు పారిశుధ్యం సక్రమంగా సాగడం లేదు. కాలం మారుతోన్న కొద్ది డెంగ్యూ కూడా మరింతగా బలోపేతం అవుతోదని, మరింత ప్రమాదకరంగా మారుతోందని డాక్టర్లు చెబుతున్నారు. డెంగ్యూ వస్తే జ్వరం ముదిరి రక్తంలో క్రమేనా ప్లేట్‌లెట్స్ పడిపోవడం మొదలవుతుంది. వెంటనే హాస్పిటల్‌లో జాయిన్ కానట్లయితే.. ప్రాణాలకే ముప్పు. అయితే, ఈ వైరల్ ఫీవర్ మనకు తెలియకుండానే మరో నష్టాన్ని కలిగిస్తోంది. నరాల సంబంధిత సమస్యలను కలిగిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు కేరళ, కర్ణాటక, ఢిల్లీ, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వైద్య నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. డెంగ్యూ సాధారణ ఫ్లూ లక్షణాలను కలిగి ఉన్నా.. అది నాడీ సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. ఎన్సెఫాలిటిస్, మెనింజైటిస్, మైలిటిస్.. మెదడు, వెన్నుపాము వాపుకు కారణమవుతాయి. ఫలితంగా డెంగ్యూ రోగులు తరచు తలనొప్పితో బాధపడతారు. అలాగే వారి మానసిక స్థితిలో కూడా మార్పులు వస్తాయి.

కొందరు కోమాలోకి జారుకోవచ్చు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినప్పుడు శరీరంలోని వివిధ భాగాల్లో రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. చివరికి మెదడులో కూడా రక్తస్రావం జరిగి.. పరిస్థితి మరింత దిగజారే ముప్పు ఉంది. కాబట్టి, డెంగ్యూను తేలిగ్గా తీసుకోవద్దు. ఇంట్లోనే ట్రీట్మెంట్ చేసుకోవచ్చులే అనుకోవద్దు.

డెంగ్యూ రోగిని హాస్పిటల్‌లో చేర్చి డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచడం చాలా మంచిది. డెంగ్యూ సోకిన రోగిలో ప్లేట్‌లెట్స్ చాలా వేగంగా తగ్గిపోతుంటాయి. ప్లేట్‌లెట్స్ వరకు తగ్గినట్లయితే.. తప్పకుండా హాస్పిటల్‌లో జాయిన్ కావాలి. ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతే.. శరీరంలో రక్తస్రావం ఏర్పడుతుంది. జ్వరం వచ్చి తగ్గుతున్నట్లయితే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. డాక్టర్ సూచన మేరకు రక్తం, ప్లేట్‌లెట్స్‌ల పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి. ఒక వేళ ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతున్నట్లు రిపోర్టులో తేలితే.. మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం కూడా డెంగ్యూపై అప్రమత్తం కావాల్సి ఉంది.

# వ్యవసాయాన్ని ఆదుకునేలా రైతుభరోసా

ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్‌ను రూపొందించారు. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందాలని మంత్రి తుమ్మల అన్నారు.ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందుకెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.

## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం
### పాల ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు ప్రమాదంలో 18మంది దుర్మరణం

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉన్నావ్ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై స్లీపర్ బస్సు, పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో 18 మంది మృతి చెందగా, 19 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఉన్నావ్ జిల్లా బంగార్‌మౌ ప్రాంతంలోని జోజికోట్ గ్రామ సమీపంలోని బెహతా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు చెప్పారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 5.15 గంటలకు బీహార్ నుంచి ఢిల్లీ వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులందరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం సిహెచ్‌సి బంగార్మావుకు తరలించారు. కాగా, ప్రాథమిక విచారణలో బస్సు అతివేగంగా దూసుకురావడంతో ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.


వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
గురువారం 11 జూలై 2024


# సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూం ఏర్పాటు.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 10 :** సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు సోకితే, సెల్ నెంబర్లు: 73864-29323, 90597-64785 కు ఫోన్ చేసి కంట్రోల్ రూం కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు కంట్రోల్ రూంకు సమాచారం తెలుపవచ్చని అన్నారు. సాధారణంగా వర్షాకాలంలో మలేరియా, చికున్ గున్యా, అతిసారం, విషజ్వరాలు వంటివి ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన సమాచారం కంట్రోల్ రూంకు అందిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన వైద్య బృందాలు స్పందించి చర్యలు తీసుకునేలా సన్నద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# గుర్రాల ప్రవీణ్ కుమార్‌కు డాక్టర్ పట్టా.











**వేగుచుక్క న్యూస్, బిక్కనూర్**

బాలకార్మిక నిర్మూలన మూల్యాంకనంపై సమగ్ర అధ్యయనం" అనే అంశంపై పరిశోధన కు గాను మండల కేంద్రానికి చెందిన గుర్రాల ప్రవీణ్ కుమార్ కు డాక్టర్ పట్టా పొందారు. తెలంగాణ విశ్వ విద్యాలయం దక్షిణ ప్రాంగణం లో సోషల్ వర్క్ విభాగం లో ముగ్గురు పరిశోధకులు గుర్రాల ప్రవీణ్ కుమార్ కు పరిశోధన పూర్తిచేసినందులకు డాక్టరేట్ అవార్డు ప్రకటించారు. డా.కె .రాజేశ్వరి పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి జి.ప్రవీణ్ కుమార్ తన పరిశోధన గ్రంథాన్ని

**బాలకార్మిక నిర్మూలన మూల్యాంకనంపై సమగ్ర అధ్యయనం"**
**అనే అంశంపై పరిశోధన.**
**టియూ పరిధిలోని బిక్నూర్ సౌత్ క్యాంపస్ కు చెందిన గుర్రాల ప్రవీణ్ కుమార్.**

సమర్పించారు. ఆయన కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలో బాలకార్మిక నిర్మూలన మూల్యాంకనంపై సమగ్ర అధ్యయనం" అనే అంశంపై పరిశోధన చేశారు. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి ఎక్సటర్నర్ గా వ్యవహరించి వారి పరిశోధనలపై సంతృప్తి వ్యక్తం చేసి డాక్టరేట్స్ అవార్డులు ప్రకటించారు. సైన్స్ డీన్ చంద్రశేఖర్ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు డా.వీరభద్రమ్, డా.అంజయ్య, డా.యాలాద్రి, డా. నర్సయ్య, డా. రమాదేవి, డాక్టరేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు డా. వంగ రాహుల్ కుమార్, డా.సంతోష్ గౌడ్, డా.నరేందర్ రెడ్డి, డా.సత్యం, పరిశోధక విద్యార్థులు బాలమణి, అరుణ్ లను ఈ సందర్భంగా అభినందించారు.

# జిల్లా అథారిటీ కమిటీనే అనుమతి ఇవ్వాలి.

## - ప్రైవేట్ ఆసుపత్రుల ఏర్పాటుపై కలెక్టర్ ఆదేశాలు.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, జులై 10**

ప్రైవేటు ఆసుపత్రిల రిజిస్ట్రేషన్, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ ద్వారానే ఆమోదించి ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు.

కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రిలో నిర్వాహకులు, వైద్యులు ప్రతినెల నివేదికలు, రోజువారి ప్రసవాల వివరాలు, సీజనల్ వ్యాధుల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని తెలిపారు. సంవత్సరానికి ఒక పర్యాయం రిజిస్ట్రేషన్ పొందిన ఆసుపత్రులను సందర్శించాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డిస్టిక్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ మీటింగ్ నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. దరఖాస్తులు నమోదు చేసిన డాక్టర్లచే ఆసుపత్రి నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ దరఖాస్తులో నమోదు చేసిన వైద్యులు కాకుండా ఇతర వైద్యులు, వైద్య సేవలు అందిస్తే వైద్యశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మగ పిల్లలు పుట్టడానికి మందులు పోస్తే వారిపైన, ఆస్పత్రి యజమాన్యం పైన డిఆర్ఎ యాక్ట్ 2010, పిసిపి ఎన్డిటి యాక్ట్ 1994 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ ఏ. అరవింద్ కుమార్, ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు శోభారాణి, శిరీష, వేణుగోపాల్, చలపతి పాల్గొన్నారు.

## అనాధ శవానికి "ఇందూరు యువత"

# అంత్యక్రియలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 10:**



నగరంలోని అనాధ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంత్య క్రియలు నిర్వహించారు. ఆకలి, ఆనారోగ్యంతో మృతిచెందిన అనాధ శవంను తీసుకు వెళ్ళడానికి ఎవరు లేరని తెలిసాకే భాద్యత తీసుకుని అంతిమ సంస్కారాలు నిర్వహించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.మనుషులుగా ఇది మన భాధ్యత అంటూ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఇప్పటికి 112 అనాధ శవాలకి అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయం.

# గ్రూప్-2, గ్రూప్-3 ఉచిత కోచింగ్ ప్రారంభం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 10**

నిజామాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అహ్మదీ బజార్‌లో గల ఉర్దూ ఘర్ లో గ్రూప్ -2, గ్రూప్ -3 అభ్యర్థులకు ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభం అయ్యాయని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తెలిపారు. గ్రూప్-2 లో 783 పోస్టులు, గ్రూప్-3 లో పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుందని, వీటికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిపుణులైన అధ్యాపకుల ద్వారా గ్రూప్స్ పరీక్షల శిక్షణ అందించబడుతోందని తెలిపారు. శిక్షణ తరగతులు ప్రతిరోజు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు (45) రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లు: 99489-56994, 97003-51786 లకు సంప్రదించాలని సూచించారు.

# ఘనంగా రుక్మిణి కళ్యాణం.

## - పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 10:**

నగరంలోని శ్రద్ధనంద్ గంజ్ లోగల ఉమామహేశ్వర దేవాలయంలో అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మద్భాగవత సప్తహ ప్రవచనములు బ్రహ్మశ్రీ ఫణతుల మేఘనాధ శర్మ చే గత ఎనిమిది రోజులుగా ప్రజలకు ప్రవచనాలు బోధించడం జరుగుతుంది. అందులో భాగంగా బుధవారం నిర్వహించిన రుక్మిణి కళ్యాణనికి అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. అయ్యప్ప భక్త బృందం నడుమ భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమం, కళ్యాణం అంగరంగా వైభోవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ, మేఘ రాజ్ శర్మ చాలా చక్కగా భగవత్ గీత సారాంశాన్ని భక్తులకు భోదించారాని, సమస్త మానవాళికి భగవత్ గీతే ఆదర్శం అని, మనిషిలో మంచి ప్రవర్తన, సేవ గుణాలను, మానసిక ధైర్యాన్ని పెంపోందించే అంశాలాన్ని భగవత్ గీతలో ఉన్నాయని అన్నారు. ఇంతటి మహాభాగ్యన్ని ఇందూర్ నగర ప్రజలకు అవకాశం కల్పించిన మేఘనాథ్ శర్మ, అయ్యప్ప భక్త బృందానికి తన తరుపున ధన్యవాదములు తెలిపారు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ






కార్యక్రమంలో ఇందూరు భక్త బృందం ఆగమయ్య గురుస్వామి, ఎంసాని రవి, లభిశెట్టి శ్రీనివాస్, పర్శి రాజేందర్, విజయ్, పగడాల రాజేష్, అర్వపల్లి బాల శేఖర్, బాలు, చిరంజీవి, దయానంద్, రాజేందర్, రేణికింది హరీష్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాసుల బాలరాజు పదవి బాధ్యతలు స్వీకరణ.

## - అభినందించిన షబ్బీర్ అలీ, పోచారం.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జులై 10:**



తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఆగ్రోస్) ఛైర్మన్ గా బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు కాసుల బాలరాజు బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. బాలరాజు ను మాజీ శాసన సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి పుష్పగుచ్ఛం అందించి శు భాకంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ జిల్లా మాజీ డిసిసిబి ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బాన్సువాడ మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందలు తెలిపారు.



# ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం.

**వేగుచుక్క న్యూస్, పాల్వంచ, జులై 10:**

జడ్పీఎచ్ఎస్ పాల్వంచ పాఠశాల నుండి పదోన్నతి, బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# అదుపు తప్పిన త్రిప్తి ఎక్స్‌పోజింగ్!



గ్లామర్ హద్దులు చెరిపేసి చెలరేగిపోవడం కొందరికి అలవాటు. బాలీవుడ్ లో మల్లికా శరావత్, రాఖీ సావంత్, మలైకా అరోరా లాంటి భామలు తొలి నుంచి గ్లామరస్ డాళ్స్ గా ముద్ర పడిపోవడంతో అటుపై ఈ భామల కెరీర్ ఏమైందో తెలిసిందే. చివరికి ఐటమ్ నంబర్లు చేసుకుంటూ ఐటమ్ క్వీన్స్ గా ముద్ర పడిపోయింది. ఆ తరహా అవకాశాలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఒకసారి ఐటమ్ నంబర్ బ్రాండ్ పడిపోతే అటుపై సాంప్రదాయ హీరోయిన్ గా నటించాలని అనుకున్నా అవకాశాలిచ్చేవాళ్లే ఉండరు. యూత్ లో ఇమేజ్ పరంగా చాలా చిక్కుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇమేజ్ కి తగ్గట్టే ఎక్స్ పోజింగ్ తప్పనిసరి అవుతుంది. ఇకపై యానిమల్ బ్యూటీ కెరీర్ కూడా అలాంటి డైలమాలో పడిపోతుందని ఊహిస్తున్నారు. లైలా మజ్ను, బుల్బుల్, ఖలా వంటి చిత్రాలలో పెర్ఫామర్ గా కనిపించిన త్రిప్తి, యానిమల్ లో పూర్తిగా గ్లామర్ డాళ్ పాత్రలో కనిపించింది. యానిమల్ కమర్షియల్ బ్లాక్ బస్టర్ కావడం.. రణబీర్ లాంటి అగ్ర కథానాయకుడి సరసన నటించడంతో తనకు అవసరానికి మించిన గుర్తింపు దక్కింది. అయితే ఇప్పుడు అదే తనకు మైనస్ గా మారినట్టు కనిపిస్తోంది. త్రిప్తి తాజా చిత్రం బ్యాడ్ న్యూజ్ తనకు ఇలాంటి ఒక బ్యాడ్ ఇమేజ్ ని సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా పోస్టర్లు, టీజర్, ట్రైలర్లో త్రిప్తి ఎంతో హాట్ గా కనిపించింది. హద్దులు చెరిపేసి గ్లామరస్ యాక్ట్‌తో రెచ్చిపోయింది. ఇంతకుముందే విడుదలైన జానమ్ సాంగ్ లో విక్కీ కౌశల్‌తో రొమాన్స్‌లో చెలరేగిపోయిన త్రిప్తి, అతడితో బెడ్ రూమ్ సన్నివేశాల్లో హద్దులు చెరిపేసింది. ఘాటైన అదర చుంబనాలతో మతులు చెడగొట్టింది. నిజానికి ఇది తనకు ఏ తరహా ఇమేజ్ ని క్రియేట్ చేస్తుంది? అంటే.. మల్లికా శెరావత్ కెరీర్ ముగింపులో ఐటమ్ భామగా మాత్రమే అవకాశాలు అందుకుంది. అదే తరహాలు తాను కూడా మరో మల్లిక అవుతుందనే సందేహాల్ని కలిగిస్తోంది. త్రిప్తికి ఇకపై ఐటమ్ లలో మాత్రమే అవకాశాలు పెరిగి, మెయిన్ లీడ్ లో ఛాన్సులు దక్కకపోవచ్చని కూడా అభిమానులు సందేహాల్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే వీటన్నిటినీ దాటుకుని త్రిప్తి తన కెరీర్ ని సవ్యమైన మార్గంలో నడిపిస్తుందేమో చూడాలి.

# కల్కి రేట్లు భారీగా పెంపు థియేటర్లకు దూరంగా మిడిల్ క్లాస్

కల్కిచిత్రంలో ఇండియన్ సినిమా లెజెండ్స్ అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ నటించడంతో.. ఈ చిత్రం వాల్యూ మరింత పెరిగింది. ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందనతో పాటు బాక్సాఫీస్ బొనాంజా కలెక్షన్లతో దూసుకుపోతుంది. సైకాలాజికల్, మైథలాజికల్, సోషల్ డ్రామా ఇలా డిఫరెంట్ జానర్‌లను కలిపి ఓ కొత్త ప్రయోగం చేసి సక్సెస్ అయ్యారు. ఈ చిత్రాన్ని దర్శకుడు నాగ్ అశ్విన్. అయితే ఈ చిత్రానికి వచ్చిన పాజిటివ్ టాక్, బజ్‌ను బట్టి ఈ సినిమా కలెక్షన్లు సునాయసంగా 1000 కోట్లకు పైగా వసూలు చేస్తుందని అంచనా వేశారు. సినిమా రిలిజై దాదాపు రెండు వారాలు దాటింది. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం 840 కోట్ల గ్రాస్‌కు చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం దాదాపు 250 కోట్లకు పైగా గ్రాస్‌ను వసూలు చేసిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే 'కల్కి 2898ంఆ' సినిమాకు వచ్చిన బజ్, పాజిటివ్ టాక్, రివ్యూలను బట్టి చూస్తే ఈ చిత్రం ఇంతకంటే ఎక్కువే వసూలు చేయాల్సిందని కొంత మంది అంటున్నారు. దీనికి ముఖ్యకారణం టిక్కెట్ల రేట్లు పెంచడమే అని అంటున్నారు. మల్టీప్లెక్స్‌లో ఈ చిత్రం టిక్కెట్ రేటు 400 రూపాయల నుండి 500 వరకు వుండటంతో చాలా మంది మధ్యతరగతి కుటుంబాలు అంతగా ఆసక్తి చూపలేదని చెబుతున్నారు. కనీసం రెండో వారంలోనైనా టిక్కెట్ల ధర తగ్గించి వుంటే.. ఖచ్చితంగా కలెక్షన్లు మరింత పెరిగేవి అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. టిక్కెట్ల ధర తమకు అందుబాటులో లేకపోవడంతో మిడిల్‌క్లాస్ ఆడియన్స్ ఓటీటీలో వచ్చినప్పుడు చూద్దాంలే అని థియేటర్లకు వైపు వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. కానీ 'కల్కి 2898ంఆ' సినిమాను థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా.. ఇలాంటి సినిమాను కూడా టిక్కెట్ల రేట్ల వల్ల ఆడియన్స్ చూడలేకపోవడం కాస్త ఇబ్బందికరమే. సో.. 'కల్కి 2898ంఆ' సినిమా వసూళ్లకు టిక్కెట్ల ధర పెంపుదల ఎంత అడ్వాంటేజీ అయ్యిందో.. అంతే మైనస్ అయ్యిందని కొంత మంది కామెంట్స్ చేస్తున్నారు.



# కల్కిని ప్రేక్షకులతో కలసి చూడాలని ఉంది

దర్శకుడు నాగ్ అశ్విన్‌ను ఇంటర్వ్యూ చేసిన బచ్చన్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ'ను తెలుగు ప్రేక్షకులతో కలిసి చూడాలని ఉందన్నారు ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్. ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించిన నేపథ్యంలో దర్శకుడిని ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ చేశారు. తాజాగా దానికి సంబంధించిన ప్రోమోను నిర్మాణ సంస్థ విడుదల చేసింది.
'కల్కి'లో చేసినందుకు వస్తోన్న ప్రశంసలు నా నటనకు అనుకోవడం లేదు. ఆ పాత్ర, కాన్సెప్ట్‌కు వస్తున్నాయి. 'కల్కి'లో దీపికా పదుకొణె పాత్ర అద్భుతం. ఈ ఐడియా వచ్చినందుకు మిమ్మల్ని (నాగ్ అశ్విన్) ప్రశంసించాలి. ఆమె నిప్పుల్లో నడుచుకుంటే వచ్చే సన్నివేశం హైలైట్. కానీ అందులో తనకేం కాకుండా చూపించారు. ఈ విషయంపై నేను ప్రేక్షకుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. సినిమా ఎలా ఉందని వాళ్లను అడిగి కనుక్కోవాలి. హైదరాబాద్‌లో ఉన్న తెలుగు ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూడాలి. ఎందుకంటే వాళ్లు సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని అమితాబ్ అన్నారు. ఇక 'కల్కి' పూర్తి కాన్సెప్ట్ గురించి నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. 'ఇది మహాభారతంలో జరిగే చివరి ఘట్టం' అని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు 'కల్కి' వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ మూవీ రూ.900 కోట్లకు పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం తాజాగా ప్రకటించింది. అలాగే ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి కూడా కొన్ని వార్తలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. ఆగస్టు 15నుంచి ఇది ఓటీటీలోకి రానున్నట్లు తెలుస్తోంది.

# వినూత్నంగా కిరణ్ అబ్బవరం సినిమా టైటిల్




యువ నటుడు కిరణ్ అబ్బవరం వైవిధ్యమైన కథలను చేస్తూ ముందుకు వెళుతున్నాడు. ఈ కోవలోనే ఇప్పుడు కిరణ్ ఒక భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాకి ఒక వెరైటీ టైటిల్ ని కూడా పెట్టాడు. ఇంతకీ ఆ సినిమా టైటిల్ ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఈ సినిమాకు 'క' అనే ఆసక్తికరమైన టైటిల్ ఈరోజు ప్రకటించారు. టైటిల్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో కిరణ్ అబ్బవరం మేకోవర్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమాను చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి దర్శకత్వం కూడా ఇద్దరు చేస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు, ఈ సినిమా కథ ఒక విలేజ్ బ్యాక్ డ్రాప్ తో వస్తోంది. అంతే కాకుండా ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథగా కూడా రూపొందిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కూడా పూర్తయ్యింది అని చెపుతున్నారు. ప్రస్తుతం ఈ 'క' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి అని చెపుతున్నారు. త్వరలో 'క' సినిమాను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నారు. కొంత విరామం తీసుకొని కిరణ్ అబ్బవరం చేస్తున్న ఈ 'క' సినిమా ప్రకటన ఆసక్తిని రేపుతోంది.

# వరుస ఆఫర్లతో కోమల్ శర్మ దూకుడు



గోట్ మంచి విజయం సాధిస్తుందని ధీమా తమిళంలోనే కాకుండా, మాలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో వరుస ఆఫర్లతో దూసుకెళుతుంది మాజీ మిస్ తమిళనాడు, స్క్వాష్ ప్లేయర్, హీరోయిన్ కోమల్ శర్మ. ప్రస్తుతం తమిళ , మలయాళాల్లో మోహన్ లాల్, విజయ్ నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టు చిత్రాలలో నటిస్తున్న ఈ ముద్దగుమ్మ ఈ చిత్రాలతో తన సినిమా కెరీర్ టర్న్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. తమిళనాడులో పుట్టి పెరిగిన కోమల్ శర్మ రెండు సార్లు మిస్ తమిళనాడు కిరీటం దక్కించుకుంది. ఆపై స్క్వాష్ ప్లేయర్‌గా తమిళనాడు తరుపున ఆడి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో చాంపియన్ షిప్‌లు సైతం గెలిచింది. 2013లో సీనియర్ దర్శకుడు ఎస్.ఏ.చంద్రశేఖర్ దర్శకత్వంలో వచ్చిన 'చట్టప్పడి కుట్రం' అనే సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన కోమల్ శర్మ ఆ తర్వాత 'అమైదిపడై-2', 'వైగై ఎక్స్‌ప్రెస్', 'పబ్లిక్', బాలీవుడ్‌లో హంగామా, తెలగులో అను అనే ఆరేడు చిత్రాల్లో నటించింది. ఎక్కువగా మోహన్‌లాల్, దర్శకుడు ప్రియదర్శన్ చిత్రాల్లో కనిపించి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దగుమ్మ కోమల్ శర్మ. ప్రస్తుతం మోహన్‌లాల్ తొలిసారి దర్శకత్వం వహిస్తూ రూపొందిస్తున్న బరోజ్ , తమిళంలో అగ్ర హీరో విజయ్ నటిస్తున్న కొత్త చిత్రం 'ది గోట్'లో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సందర్భంగా ఆమో ఓ మీడియాతో మాట్లాడుతూ.. 'ది గోట్'లో హీరో విజయ్‌తో కలిసి నటించే సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయని సినిమా భారీ విజయం సాధించి తమిళ చిత్ర పరిశ్రమలో ఒక ట్రెండ్ సృష్టిస్తుందన్న నమ్మకం ఉందన్నారు.




# సోషియో ఫాంటసీ చిత్రలకు బహుళ ఆదరణ

ఇది ఈ నేల గొప్పతనమన్న నటి మంచు లక్ష్మిశక్తిమంతమైన సోషియో ఫాంటసీ కథల్ని తీసి ప్రేక్షకులకు చూపిస్తున్నామంటే అది మన నేల గొప్పతనమే' అన్నారు నటి మంచు లక్ష్మి.ఆమె ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'ఆదిపర్వం'. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోన్హా కీలక పాత్రలు పోషించారు. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. ఎమ్.ఎస్.కె నిర్మాత. తెలుగుతోపాటు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళంలో రూపొందిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ దేవతగా నటించాలన్నా... దెయ్యం పాత్ర అయినా ఈమధ్య నన్నే సంప్రదిస్తున్నారు. 'యక్షిణి' అనే వెబ్ సిరీస్ చేశాను. చాలా మంచి స్పందన వచ్చింది. ఆ వెంటనే 'ఆదిపర్వం' చేశా. ఓ మంచి సోషియో ఫాంటసీ చిత్రమిది. మా బృందమంతా ఎంతో కష్టపడి ఈ సినిమా చేసింది. నేను గతేడాది మొత్తం యాక్షన్ సన్నివేశాల్లో నటిస్తూనే ఉన్నా. అంతగా నాతో యాక్షన్ చేయించారు. మా దర్శకుడు ఓ భగీరథ ప్రయత్నమే చేశాడు. ఇంత భారీ చిత్రాన్ని సీజీతో సహా పూర్తి చేసి వేగంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండడం అభినందనీయం' అన్నారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ 'నాగులాపురం నాగమ్మ పాత్రలో అలరిస్తారు మంచు లక్ష్మి. ఆమె ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాక సినిమా స్వరూపమే మారిపోయింది. ఇంటిల్లిపాదికీ నచ్చే చిత్రమిది' అన్నారు. శివ కంఠంనేని మాట్లాడుతూ 'నేను క్షేత్రపాలకుడి పాత్రలో నటించా. నా మేకప్ కోసమే మూడు గంటల సమయం పట్టేసింది. నేను చేశానని చెబితే తప్ప గుర్తు పట్టలేని విధంగా ఉంటుందా పాత్ర. ఓ మంచి ప్రయత్నంగా ఈ సినిమా నిలిచిపోతుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో గీత రచయిత సాగర్ నారాయణ్, సంగీత దర్శకులు దొంతం ప్రవీణ్, మాధవ్ సైబా, గూడ రామకృష్ణ, బీఎన్ శర్మ, వెంకట్ కిరణ్, జెమినీ సురేశ్ పాల్గొన్నారు.